విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే **చట్టం మీ చుట్టం** దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 135 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శనివారం 30 మే 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## ఆర్టీసీ బలోపేతంపై బాబు దృష్టి

### అధజకారులతో సిఎం సమీక్ష



**అమరావతి,మే29 (చట్టం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బలోపేతంపై సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..

## పోలవరం అడవుల్లో పులి సంచారం

### అధికారులను అప్రమత్తం చేసిన పవన్



**అమరావతి,మే29 (చట్టం న్యూస్) :** పోలవరం అడవుల్లో పులి సంచారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో పులి కదలికలు గుర్తించిన అధికారులు, పులి సమీప గ్రామాల వైపు సంచరిస్తోందని వెల్లడించారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హనుమాన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని అధికారులను ఆదేశించారు. మనుషులు, పశువుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు స్పష్టం చేశారు. అవసరమైతే


మిగతా 2వ పేజీలో..

# రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

- స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు
- విజయవంత చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేనా కృతజ్ఞతలు
- మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్

**అమరావతి,మే29 (చట్టం న్యూస్):** తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, ఎ÷ఆఖ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం

మిగతా 2వ పేజీలో..



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై విచారణ

**న్యూఢిల్లీ,మే29 (చట్టం న్యూస్):** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్ అలీఖాన్, అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తనపేరు సూచించి.. తర్వాత నిర్ణయం మార్చుకున్నారని అమీర్ ఖాన్ తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం

మిగతా 2వ పేజీలో..

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

- టిడిపి సంస్కరణలకు ఎప్పుడూ ముందుంటుంది
- హోంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి,మే29 :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది

మిగతా 2వ పేజీలో..

## ఎట్టకేలకు వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు పరిష్కారం

### మంత్రి అనగాని ప్రసాద్ చొరవతో దక్కిన ఊరట



**అమరావతి,మే29 (చట్టం న్యూస్):** గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో 120 ఏళ్ళుగా కొనసాగుతున్న సమస్యకు చెక్ పెట్టారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు సమగ్రంగా పరిశీలించి, శతాబ్ద కాలంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న గ్రామాన్ని ఆ జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలోని 515 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వివరాల్లోకి వెళితే.. క్రీ.శ.1134 నుంచే వట్టిచెరుకూరు గ్రామం ఉనికిలో ఉన్నట్లు వెల్లడైంది. 1931 నుంచే ఈ ఊరు గ్రామపంచాయతీగా కొనసాగుతూ వస్తోంది. గ్రామస్థులు అప్పటి నుంచే పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, 2006లో జరిగిన ఆర్ఎస్ఆర్ నమోదులో పొరపాటున గ్రామాన్ని 'ఊరి ముందరి చెరువు'గా పేర్కొన్నారు. అనంతరం

మిగతా 2వ పేజీలో..

# ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు



- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్
- సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,మే29 (చట్టం న్యూస్):** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం

మిగతా 2వ పేజీలో..

## ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి ఆస్ట్రేలియా పురస్కారం



**అమరావతి,మే29(చట్టం న్యూస్) :** ప్రముఖ ఫోటోగ్రాఫర్ టి. శ్రీనివాస రెడ్డి ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్టాత్మక 'ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ' అత్యున్నత పురస్కారం గౌరవాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి

మిగతా 2వ పేజీలో..

# బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర సమీక్ష



- ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సమన్వయం
- వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు
- బహిరంగ మార్కెట్లో ధరల స్థిరీకరణకు చర్యలు
- సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్

**అమరావతి,మే29 (చట్టం న్యూస్):** ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరల మార్పులను

మిగతా 2వ పేజీలో..

## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు



**హైదరాబాద్,మే29 (చట్టం న్యూస్) :** పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

# వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

### కొత్తగా మరో ఆరు ప్లాంట్ల ఏర్పాటు

### పురపాలక మంతంరి నారాయణ వెల్లడి

విజయవాడ,మే29 **(చట్టం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ

మిగతా 2వ పేజీలో..

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,మే29 **(చట్టం న్యూస్):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు

మిగతా 2వ పేజీలో..

# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

**1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం**

**తిరుమల,మే29 :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

మొదటి పేజి తరువాయి..

5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఎ÷-లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'ఏపీ ప్రజల నుంచి గత ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ఎ÷-లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ఎ÷-లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు. పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సీబీజీ ఎ÷-లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సీబీజీ ఎ÷-లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సీబీజీ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం' అని మంత్రి పేర్కొన్నారు.

## నిరవదిక దీక్షకు బీజేపీ మద్దతు



**బోయిన్ పల్లి మండలం / మే 29,( చట్టం బ్యూరో ) :** తెలంగాణలో ఐూాల నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ బోయిన్పల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఐూాల నిరవధిక నిరాహార దీక్షకు భారతీయ జనతా పార్టీ బోయిన్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురామ్ నాయకత్వంలో సంఘీభావం ప్రకటించడం జరిగింది.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురామ్ మాట్లాడుతూ "ప్రభుత్వం వెంటనే ఐూాల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఐూాల సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరం. ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ నిరవధిక నిరాహార దీక్ష పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ప్రజాసేవకుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహా చారి మండల ప్రధాన కార్యదర్శిలు రాజేంద్రప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్ , మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య , పసికంటి వెంకటేశం యువమోర్చా మండల అధ్యక్షులు మిరియాల శరత్ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు భూమ్ రెడ్డి, తుమ్మనపల్లి కిరణ్, బూత్ అధ్యక్షులు ముస్కు విజయేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఐూా లు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/మే 29 ,(చట్టం బ్యూరో) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీ ఎల్ ఓ లు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర సమీక్ష

మొదటి పేజి తరువాయి..

నిత్యం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ 8వ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రుల కమిటీ సభ్యులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ, పప్పులు, బియ్యం, వంట నూనెలు, టమోటా, ఉల్లిపాయల వంటి నిత్యావసర వస్తువుల డిమాండ్, రిటైల్ హోల్‌సేల్ మార్కెట్ ధరల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ ప్రభావంతో కొంతమేర ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో



రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ , పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, మనోహర్ తెలిపారు. రైతులు ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలను సాగు చేసేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్ తక్కువ ఉన్న వరి రకాల సాగు వల్ల ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1010, పీఆర్-126 వంటి రకాలలో అధిక శాతం నూక వస్తుండటంతో వినియోగానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా యంత్రాంగానికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ధరలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చామని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నా బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు, ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

మొదటి పేజి తరువాయి..

తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది.

అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ పక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

## పోలవరం అడవుల్లో పులి సంచారం

మొదటి పేజి తరువాయి..

అదనపు హనుమాన్ బృందాలను పంపాలని కూడా సూచించారు. చికిలింత పంచాయతీ పరిధిలోని ఒక పశువుల పాకపై పులి దాడి చేయగా, ఈ ఘటనలో 9 దూడలు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అలాగే అడవికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆయిల్ ఫామ్ తోటలో కూడా పశువులపై దాడి జరిగినట్లు వెల్లడించారు. పులి సంచారంపై ఆధునిక సాంకేతికతతో నిఘా ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో నిరంతర అప్రమత్తత కొనసాగించాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. మొత్తం ఆపరేషన్‌పై స్వయంగా పర్యవేక్షణ చేయాలని, అవసరమైతే కేంద్ర కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని ఘటనాస్థలికి పంపాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పులి సంచారం ఉన్న గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, ప్రజలు అనవసరంగా అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పశువులను అడవి సమీపంలో కట్టివేయకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని చెప్పారు. బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించామని, త్వరలో పూర్తి పరిహారం చెల్లిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.

## రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

మొదటి పేజి తరువాయి..

రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై విచారణ

మొదటి పేజి తరువాయి..

ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధాన కేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

మొదటి పేజి తరువాయి..

మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని అనిత అన్నారు. పార్లమెంటు చట్టంతో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనపై పార్టీలో మరింత చర్చ చేసి 2029 ఎన్నికలనాటికి తప్పకుండా అమల్లోకి తెస్తామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లపై ఇతర పార్టీల నిర్ణయాలపై తాము మాట్లాడమని తెలిపారు.

## ఆర్టీసీ బలోపేతంపై బాబు దృష్టి

మొదటి పేజి తరువాయి..

దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సంస్థ సమస్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ ఆస్తుల సద్వినియోగం, ఉద్యోగుల సంక్షేమం, ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం, బస్సుల నిర్వహణ, సదుపాయాలతోపాటు సంస్థ బలోపేతంపై ఈ సమీక్షలో చర్చించారు. అలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్షలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతోపాటు ఆ శాఖలోని పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై ఇప్పటికే యూనియన్ నేతలతో అధికారులు ఒక దఫా చర్చలు నిర్వహించారు.

## ఎట్టకేలకు వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు పరిష్కారం

మొదటి పేజి తరువాయి..

2008లో రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ(1)(బి) కింద మొత్తం గ్రామాన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో గ్రామస్థులు తమ భూములను కొనుగోలు, విక్రయాలు చేయలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామస్థుల వినతిపై స్పందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్, సమస్యను ప్రత్యేకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో గ్రామాన్ని పొరపాటున ఊరి ముందరి చెరువుగా నమోదు చేసినట్లు తేలింది. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ విస్తీర్ణంలో ఉన్న 25.37 ఎకరాలను గ్రామకంఠంగా ప్రకటిస్తూ, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోంది. ప్రజలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని అన్నారు.

## ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

మొదటి పేజి తరువాయి..

సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు.

## ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి ఆస్ట్రేలియా పురస్కారం

మొదటి పేజి తరువాయి..

గాను ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన గుర్తింపును ఆయన దక్కించుకున్నారు. ఇద్దరు కళాకారులు పోటీపడగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన సాధించిన విజయాలకు ఈ పురస్కారం మరింత గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫిక్ సొసైటీతో తనకు దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు. గతంలో తన ప్రతిభను గుర్తిస్తూ 2016లో ఆ సొసైటీ ప్రతిష్టాత్మక 'ఏపీఎస్ ఫెలోషిప్' గౌరవాన్ని అందించిందని తెలిపారు. ఆ గౌరవం దక్కిన పదేళ్ల తర్వాత, ఇప్పుడు అంతకంటే అత్యున్నతమైన 'మాస్టర్' స్థాయిని అందుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రతిష్టాత్మక గౌరవాలను సొంతం చేసుకున్న ఆయన తాజా పురస్కారంతో తెలుగువారందరికీ గర్వకారణంగా నిలిచారు.

# విత్తనాలు,ఎరువుల దుకాణాలపై టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు.

**పెగడపల్లి, మే 29: (చట్టం న్యూస్):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో నాణ్యత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండల టాస్క్ ఫోర్స్ బృందం ఏం ఏవో శ్రీకాంత్ , ఎస్సై కిరణ్ కుమార్ మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు.తనిఖీల సందర్భంగా డీలర్లకు అనుమతించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, హెచ్.టి. పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని ఆదేశించారు. అలాగే విత్తనాలు ఎరువుల విక్రయాల సమ యంలో తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని



సూచించారు.ఎరువులను గరిష్ట చిల్లర ధర ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదని, నిర్ణయించిన ధరలకే రైతులకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చేయడం మరియు రైతుల ప్రయోజనాలను కాపాడడం లక్ష్యంగా ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.





# బోగస్ ఓట్ల నిర్మూలనే ఎస్ఐఆర్ లక్ష్యం

- **ప్రజా సమస్యలను పట్టించుకోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**
- **బీజేపీ వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**
- **ఎస్ఐఆర్ అవగాహన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 29 (చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ బీజేపీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో శు క్రవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం రైతు సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు.స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా బోగస్ ఓట్లను తొలగించి ఓటరు వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యమని తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్లాడి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఒకే వ్యక్తికి పలుచోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి తొలగించడం, ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి బీజేపీ కార్యకర్త, బూత్ అధ్యక్షుడు తమ పరిధిలో ఉన్న డబుల్, బోగస్ ఓట్లను గుర్తించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు బుర్ర శేఖర్ మాట్లాడుతూ రైతుల సమస్యలపై 15 రోజుల క్రితమే ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు.రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి ధర్నాలకే పరిమితమవుతోందని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, మల్లేశం, కౌన్సిలర్లు కొండ్లెపు చిన్న ముత్యం, మంగళ శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---------

# అందుబాటులో లేకున్నా మానవత్వం చాటుకున్న సమ్మి గౌడ్.

- **కామ్రేడ్ భాస్కర్ రెడ్డి కుటుంబానికి అండగా సమ్మిగౌడ్ ఫౌండేషన్.**
- **తక్షణ సాయంగా క్వింటాల్ బియ్యాన్ని పంపించిన సమ్మి గౌడ్ చిలువేరు.**
- **ప్రజల కోసం పోరాడిన నాయకుడి కుటుంబానికి తోడుగా నిలిచిన వ్యక్తి సమ్మిగౌడ్,సామల నర్సయ్య**
- **పార్టీలకు అతీతంగా సమ్మి గౌడ్ సేవలు అభినందనీయం.**
- **బండ్లపల్లి వెంకటేశ్వర్లు సిపిఐఎం నాయకులు.**

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సిపిఐఎం న్యూ డెమొక్రసీ నాయకుడు,భారత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి,మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ కన్మంత రెడ్డి భాస్కర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తన స్వగ్రామం ఈదుల పూసపల్లి లో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, కార్మికుల హక్కుల సాధనలో నిరంతరం పోరాడిన భాస్కర్ రెడ్డి మరణం పార్టీకి,ప్రజా సంఘాలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. భాస్కర్ రెడ్డి కుటుంబ పరిస్థితిని పార్టీ జిల్లా నాయకుడు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు.ఆ సమయంలో సమ్మి గౌడ్ అందుబాటులో లేకపోయినా,విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున భాస్కర్ రెడ్డి కుటుంబానికి తక్షణ సహాయం కింద ఒక క్వింటాల్ బియ్యాన్ని పంపించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సిపిఐఎం నాయకులు మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ప్రజల కష్టసుఖాల్లో స్పందిస్తూ




సహాయం చేయడం సమ్మిగౌడ్ ఫౌండేషన్ ప్రత్యేకత ఆపదలో ఉన్న కుటుంబాలకు వెంటనే అండగా నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. సమ్మి గౌడ్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకుడు కామ్రేడ్ షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి





- **రైస్ మిల్లుల వద్దా ధాన్యం 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**

**రాయికల్ మే 29 చట్టం :** రాయికల్ మండలం మైతాపూర్ గ్రామం లోని ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మరియు రాయికల్ మండలం లోని శివమని రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, నాయబ్ తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.


# మహిళలు ఆర్థికంగా ఎదగాలి





**రాయికల్ మే 29 చట్టం :** స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఎదగాలని రాయికల్ ఏపిఎం నరహరి అన్నారు. శుక్రవారం మండలంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బ్యాంకు లింకేజి గ్రౌడింగ్ మేళను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 36 స్వయం సహాయ మహిళా సంఘాలకు ఐదు కోట్ల బ్యాంకు లింకేజీ రుణములను మహిళలను ఆర్థికంగా బలోపితం చేయడానికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, సబ్సిడీలు అందిస్తున్నారు. వీటిని ఉపయోగించుకొని వివిధ ఆదాయ అభివృద్ధి యూనిట్లు నిర్వహించి ఆర్థిక పరిపుష్టిని సాధించాలని కోరారు. ప్రమాద బీమా 10 లక్షల వరకు వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్స్ టీజీపీ అల్లిపూర్ బ్యాంకు రాజేష్, యూబిఐ ఇటిక్యాల్ బ్యాంక్ మేనేజర్ వినయ్, యూబిఐ రాయికల్ బ్యాంకు మేనేజర్ నరేష్, ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, అన్ని గ్రామాల వివో అధ్యక్షులు, వివోఏలు హాజరయ్యారు.

# చల్మెడ లక్ష్మీనరసింహారావును కలిసిన బి ఆర్ ఎస్ నేతలు



**బోయిన్ పల్లి మండలం / మే 29 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలం లోని బి ఆర్ ఎస్ నేతలు వేములవాడ నియోజక వర్గ బి ఆర్ ఎస్ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహ రావు ను మర్యాద పూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నేతలు అక్కెనపల్లి కరుణాకర్ , అరె మహేందర్, తిక్కల నవీన్,బడుగు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


# పదవి విరమణ అభినందన సభ.



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** సహకార వ్యవస్థలో 42 ఏళ్ల పాటు విశేషమైన సేవలందించి,రైతులు,సంఘం సభ్యులు అభ్యున్నతి కోసం ఆహర్నిశలు కృషి చేసిన 3వ వార్డుకి చెందిన దన్నసరి పిఎసిఎస్ బ్యాంక్ సిఈఓ గోపాల మల్లారెడ్డి -పుష్పావతి దంపతుల పదవి విరమణ అభినందన సభ హరి హర గార్డెన్స్ నందు హాజరై శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భుక్య మురళి నాయక్. ఈ కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి,కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు, దన్నసరి మాజీ ఉప్పసర్పంచ్ బానోత్ వెంకన్న,మాజీ పిఎసిఎస్ చైర్మన్ బండారు వెంకన్న, పిసిసి మెంబర్ దస్రు నాయక్,3వ వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ఎండి అయూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, కాకి విజయ, మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య,అల్లం గణేష్ యాదవ్,స్థానికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక

**రాయికల్ మే 29 చట్టం :** సేవ చేయడానికి లైన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాములు అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయికల్ వారి ఆధ్వర్యంలో దాతలు ఎనగంటి రాములు తంగెళ్ల రమేష్ గార్ల సహకారంతో రెండు నూతన బాడీ ఫ్రీజర్స్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింహరాజు కోదండరాములు మాట్లాడుతూ ఇంక మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని అన్నారు. మరియు నూతనంగా ఎన్నికైన స్థానిక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లను మరియు కోఆప్షన్ మెంబర్స్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొడుగం అంజి రెడ్డి, కోశాధికారి బెక్కం తిరుపతి, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ మోర హనుమాన్లు, డిసిలు బత్తిని భూమయ్య, మేకల రమేష్, కాటిపల్లి రాంరెడ్డి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవి, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, ఆది రెడ్డి, గంప ఆనందం, వాసం ప్రసాద్, బొమ్మ కంటి నవీన్, సుధ వేణి మురళి, కురుమ సుదర్శన్ రెడ్డి, కొయ్యడి మైపాల్ రెడ్డి, గంట్యాల ప్రవీణ్, కనపర్తి శ్రీనివాస్, వాసం స్వామి, సామల లక్ష్మీనారాయణ, ఆడెపు రాంప్రసాద్, ఎర్ర సుమన్, జిల్లాల సూర్యం రెడ్డి, సాంబారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

### కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

### స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక

### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్




**అమరావతి,మే29** : 'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్దాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# ఘనంగా టి పి టి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుక- పిఆర్సి వెంటనే ప్రకటించాలని డిమాండ్.

- తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్.
- కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ.
- టి పి టి ఎఫ్ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి దిక్సూచి లాంటిది అని ఉద్ఘాటన.
- పెండింగ్‌లో ఉన్న డీఏలను, అన్ని రకాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.
- నూతన నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి షరతులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలి.
- ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న సీనియర్ నాయకులు చీకటి వెంకట్రాంనర్సయ్య కు మండల శాఖ పక్షాన ఘన సన్మానం.



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** ఉపాధ్యాయులకు అందని ద్రాక్షలా మిగిలిపోతున్న పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న నూతన నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి షరతులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 29 మే న కేసముద్రం మండల విద్యా వనరుల కేంద్రంలో టి పి టి ఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.టి పి టి ఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మండల శాఖ నిర్మాణ బాధ్యులు,ఈనెలలోనే ఉద్యోగ విరమణ పొందుతున్న చీకటి వెంకట్రాం నర్సయ్య మండల శాఖ నిర్ణయం మేరకు ఈ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గత నలభై సంవత్సరాలు గా టీపీటీఫ్ సంఘానికి సేవలు అందించి రిటైర్ కాబోతున్న చీకటి వెంకట్రాం నర్సయ్య ను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల సాధన,ప్రభుత్వ విద్యా పరిరక్షణ,విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా టి పి టి ఎఫ్ ఏర్పడిన నాటి నుండి నిరంతర పోరాట పంథాలో ముందుకు సాగుతోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల పరిరక్షణలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు.ప్రస్తుతం ఉపాధ్యాయులు అనేక పరిపాలనా ఒత్తిళ్లు, బోధనేతర పనుల భారం, ఖాళీ పోస్టులు,పెండింగ్ సమస్యలు,పదోన్నతులు ఆలస్యం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే ఈ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో నూతన ఆరోగ్య పథకం అమలు అయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పెండింగ్లో ఉన్న ఐదు డి ఏ లను,పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని అయన డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి నర్సింహ రాజు,సీనియర్ నాయకులు స్టేషన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బందెల రాజు,మండల శాఖ నిర్మాణ బాధ్యులు చీకటి వెంకట్రాం నర్సయ్య,ఉపాధ్యక్షులు కొమ్ము రాజేందర్,సంద్ర రాధిక,కార్యదర్శులు వీసం నర్సయ్య, జీ.మోహనకృష్ణ, బొల్లెద్దు చందర్,జిల్లా కౌన్సిలర్ ముదిగిరి సదయ్య, అకడమిక్ సెల్ కన్వీనర్ జి. శ్రీనివాస్,కమిటీ సభ్యులు కుసుమ సంతోష్,ఎస్.అనిత, వి.స్వర్ణలత,జి. చిన్నమ్మ, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ఫలితాలపై ప్రకారం చేయాలి
- విద్యార్థుల నమోదు శాతం పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బడిబాట 2026-27పై సన్నాహక సమావేశం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 29,( చట్టం బ్యూరో) :** బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఈ విద్యా సంవత్సరం 2026 - 27కు సంబంధించి బడి బాటపై విద్యా శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శు క్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బడి బాట లో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ఎవరైనా డ్రాప్ అవుట్ ఉంటే వారిని కూడా చేర్పించాలని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి అంగన్వాడీ టీచర్ల సాయంతో అంగన్వాడి నుంచి ప్రతి విద్యార్థిని ప్రైమరీ స్కూల్ కు పంపాలని సూచించారు. అలాగే జిల్లా లేబర్ ఆఫీసర్ వర్క్ సైట్లలో ఎవరైనా బడి మానేసిన పిల్లలు ఉంటే వారిని బడికి పంపేలా చూడాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉచిత



యూనిఫామ్స్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, మధ్యాహ్న భోజనం ఇస్తున్నామని వెల్లడించారు. ఈ సంవత్సరం నుంచి పిల్లలకు అల్పాహారం కూడా ప్రభుత్వం ఇవ్వనున్నదని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గోపు చిన్న రాజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్





**బోయిన్ పల్లి మండలం /మే 29 ,(చట్టం బ్యూరో) :** బోయినపల్లి మండల దేశాయ్ పల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గోవు చిన్న రాజిరెడ్డి గారు గత నాలుగు రోజులక్రితం స్వర్గస్తులైనారు ఈరోజు వారి నివాసంలో కుటుంబ సభ్యులు కుమారులు గోపు బాపు రెడ్డి , కృష్ణరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి గార్లను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ గారు ఇందులో పాల్గొన్న గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, చింతపల్లి గుంటీ శంకర్, చింతపల్లి వెంకట్ రెడ్డి, మానేరు లక్ష్మ రెడ్డి, చిందం రమేష్ అక్కెనపల్లి కర్ణాకర్ బత్తిని కమల్ గౌడ్, గురజల కోటి, బత్తిని హరీష్ గౌడ్, పెండ్యాల మహిపాల్ రెడ్డి, బత్తిని అనిల్ గౌడ్ , పొన్నాల మల్లేశం. కట్కూరి సుదర్శన్ , బూరుగు నవీన్, తదితరులు పాల్గొన్నారు

# ఖుష్బూ దంపతుల కుమార్తె అవంతిక వివాహం

### ప్రధాని మోడీని కలిసి శుభలేఖ అందచేత



**న్యూఢిల్లీ,మే29** : ప్రధాని నరేంద్ర మోదీని సినీ నటి, భాజపా నేత ఖుష్బూ కుటుంబం శుక్రవారం దిల్లీలో కలిసింది. తమ కుమార్తె అవంతిక వివాహానికి ఆహ్వానిస్తూ.. ఖుష్బూ, సుందర్ సి దంపతులు శుభలేఖను అందజేశారు. వారితోపాటు అవంతిక, ఆమెకు కాబోయే భర్త శ్రవణ్ శ్రీనివాసన్ కూడా ఉన్నారు . ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు ఖుష్బూ. ప్రధానితో కలిసి దిగిన ఫొటోను కూడా షేర్ చేశారు. 'బిజీ షెడ్యూల్‌లోనూ ప్రధాని మోదీ మాకు సమయం ఇచ్చినందుకు కృతజ్ఞులం. కాబోయే దంపతులను ఆయన ఆశీర్వదించారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. థాంక్యూ మోదీజీ' అని పేర్కొన్నారు. ఖుష్బూ దంపతుల చిన్న కుమార్తె అయిన అవంతిక నటిగా మలయాళంలో ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆరంభం' అనే చిత్రంలో ఆమె యాక్ట్ చేస్తున్నారు. పెద్ద కుమార్తె ఆనందిత నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ కార్యక్రమం

**బి వాణిశ్రీ, సి డి పి ఓ**






**వెల్గటూర్, మే 29 (చట్టం):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ కార్యక్రమం బీరుపూర్‌శ్రీ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సి డి పి ఓ వాణి శ్రీ, మేడమ్ మాట్లాడుతూ మహిళ గర్భధారణ దాల్చిన నుండి మొదటి 1000 రోజుల వరకు బిడ్డ శారీరక ,మానసిక ఎదుగుదల చాలా ముఖ్యమని వివరించారు. పిల్లల సంరక్షణకు పోషణ,ఆరోగ్యం , ప్రారంభ విద్య, స్పందనాత్మక తల్లిదండ్రులు, భద్రత మరియు రక్షణ, తల్లిదండ్రుల శ్రేయస్సు అనేవి ఆరు ముఖ్యమైన స్తంభాలని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఎనమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనగంటి జితేందర్,గసిడిపిఓ వాణిశ్రీ, మౌనిక, సూపర్వైజర్ స్వప్న, అంగన్వాడి టీచర్లు మరియు అంగన్వాడి ఆయమ్మలు , గర్భిణీలు బాలింతలు మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు చర్యలు

### అధికారులతో సమీక్షలో చంద్రబాబు



అమరావతి,మే29 : సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని.. అందుకోసం సైబర్ పెట్రోలింగ్ జరగాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యచరణపై ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఏపీ సైబర్ గార్డ్' అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో ఈ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని చెప్పారు. సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌లో రావాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రజలు నష్టపోకుండా సహకరించాలని బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు.

# ప్రకృతి సంపదను దోచుకుని,కో ల్లగొట్టే మాఫియాలపై కఠినతరమైన చర్యలు తీసుకోవాలి






- **ఇటుక ధర పేదలకు అందుబాటులో ఉండేలా,ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి**
- **ఇటుక బట్టీ యాజమాన్యాలపై చర్యలు తీసుకొని అక్రమ మట్టి తరలింపు పై కొరడా జూలిపించాలి**

**బోయిన్ పల్లి మండలం / మే 29,(చట్టం బ్యూరో) :** అడ్డు అదుపు లేకుండా ఇటుక ధరలు పెంచి సామాన్యుడు నడ్డి విరిచిన చోద్యం చూస్తున్న ప్రభుత్వ పాలకవర్గాలు. పేదల ప్రభుత్వమని ఎలా చెప్పుకుంటారు. మండల సిపిఎం పార్టీ డిమాండ్. చెరువుల మట్టిని, కాలువల మొరం,, ఇసుక మాఫియా,చెట్ల విధ్వంసాన్ని, ప్రకృతి సంపదను దోచుకునే మాఫియాలపై ఉక్కు పాదం మోపకుంటే రాబోయే రోజులలో ప్రకృతి విధ్వంశాలకు మనమే కారణభూతామ్ అవుతాం. రాబోయే రోజుల్లో ఈ విధ్వంసానికి అడ్డుకట్ట వెయ్యకపోతే పేద వర్గాలకు, మధ్య తరగతి వర్గాలకు జాతి సంపద ఆందకుండా కేవలం సంపన్న వర్గాలకే పరిమితమై మన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఎటు తోచని దిక్కులేని పరిస్థితులలో నిలబడే పరిస్థితి దాపురిస్తుంది.. సంపన్న వర్గాలకు, జాతి సంపాదన దోచుకునే మాఫియాలకు ఈరోజు ప్రభుత్వాలు , పాలకులు,దగ్గర ఉండి కార్పెట్ పరుస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.. కానీ ఈరోజు అదే ప్రభుత్వాలు పేదవాళ్లకు, మధ్యతరగతి వర్గాల ప్రజలకు చెరువులోని మట్టిని కావాలనుకున్న, కాల్వ గట్టును మొరం కావాలనుకున్న, వాగులోని ఇసుక కావాలన్నా అరకొర పరిమితులు విధిస్తూ అనేక నిబంధనలు విధిస్తూ,అడ్డంకిగా మారుతున్న య్. ఈ స్థితి మారాలి.. పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే ఇసుక, ఇటుక, స్టీలు, సిమెంటు, తదితర నిర్మాణరంగం వస్తువులపై ప్రభుత్వ ము ధరలు తగ్గించి ఒక స్థితికరణ ఉండే విధంగా ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణలో ఉండేటట్టుగా చర్యలు తీసుకుంటే పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేసిన వాళ్ళం అవుతాం. పాలకుల రా ఇప్పటికైనా మేల్కొనండి పేద మధ్యతరగతి బలహీన వర్గాల వైపు నిలబడి వారి జీవితాలలో మార్పును కోరుకుందాం. ధరలు నియంత్రణకు కళ్లెం వేద్దాం..

# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

- **ప్రభుత్వ జూనియర్ కళాశాలకి బస్సు సౌకర్యం కల్పించాలి.**
- **గజ్జెల శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.**




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 29 ,(చట్టం బ్యూరో) :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చొప్పదండి మండల ముఖ్య సమావేశం మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ హాజరైనారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో సరిపడా స్కావెంజర్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా నెలపొంది. అదేవిధంగా చాలా పాఠశాలలో వంటగదిలేని పరిస్థితి ఉంది. కావున ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కరించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా చొప్పదండి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల కనీసం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి మండల కేంద్రంలో కనిపిస్తుంది. కళాశాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు విద్యార్థులు కాలి నడకన నడుస్తున్న పరిస్థితి ఉంది. కావున తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని చెప్పి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యారంగాన్ని పూర్తిగా కూని చేసే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తుంది కావున ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి 30% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. గురుకులాలలో అనేక సమస్యలు వలయంగా ఉన్నాయి అద్దె భవనాలలో అరకుర వసతులతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా కనిపిస్తుంది. గురుకులాలకు సొంత బోనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ, శివనికిల్, శేఖర్, శ్రీ హర్ష ,అక్షయ్, వినయ్, మనీ, నవదీప్

# మీ భద్రతే మా బాధ్యత" --- ప్రజల్లో భద్రతా చైతన్యం పెంచుతున్న మేడిపల్లి పోలీసులు...

- **చెన్నారెడ్డి ఎంక్లేవ్‌లో మీ సురక్ష అవగాహన కార్యక్రమం..**
- **ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్ కుమార్ కీలక సూచనలు..**




**మేడిపల్లి,మే 29, (చట్టం) :** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి ఎంక్లేవ్ ఆనందమయి అపార్ట్మెంట్ పరిసర ప్రాంతాల్లో "మీ సురక్ష" కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్మెంట్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్ కుమార్ గారు మాట్లాడుతూ ఇంటి పనిమనుషులు, డ్రైవర్లు, మైడ్ సర్వెంట్లు నియమించుకునే ముందు వారి పూర్తి వివరాలు సేకరించి పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవడం తప్పనిసరి అని సూచించారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు పత్రాల ప్రతులు తీసుకోవాలని తెలిపారు.


అలాగే నగదు, బంగారం, ముఖ్య పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, ఇంటి తాళాలు లేదా పాస్‌వర్డు అవసరం లేకుండా ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100ను సంప్రదించాలని సూచించారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు చెందిన పనిమనుషుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తుల వివరాలు పూర్తిగా ధృవీకరించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా మేడిపల్లి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మోహన్ కుమార్ గారు మాట్లాడుతూ "సిటిజన్స్ మీ సురక్ష" యాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మేడిపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకరయ్య గారు, పోచారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ కనకయ్య గౌడ్ గారు, అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు. దాదాపు వందమంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

------------









## గోపాల్‌పూర్‌లో ఘనంగా కరాటే పోటీలు -- విద్యార్థుల ప్రతిభకు మెడల్స్ ప్రదానం










**హనుమకొండ,29 మే (చట్టం) :** హనుమకొండ జిల్లా గోపాల్ పూర్‌లో సికోక్తై శిథోర్యు కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్టల ప్రదానోత్సవం మరియు ఇంటర్ స్కూల్ కరాటే పోటీలు ఘనంగా నిర్వహించారు. మే 28, 29 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ కౌటిల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. సమ్మర్ క్యాంప్‌లో నిర్వహించిన వివిధ బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, అలాగే టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను అందజేశారు. పోటీల్లో బాలికల కటా మరియు కుమిటే విభాగాల్లో టి. మాన్విత అద్భుత ప్రతిభ కనబరిచి రెండు గ్రాండ్ ఛాంపియన్ టైటిల్స్‌ను కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో కటా విభాగంలో ఋత్విక్ మహదేవ్ గ్రాండ్ ఛాంపియన్‌గా నిలవగా, కుమిటే విభాగంలో రక్షిత్ గ్రాండ్ ఛాంపియన్‌గా విజయం సాధించాడు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్లు డి. శంకర్, అశోక్, సెన్సాయ్ సలీం పాషా భారత్, వెంకటేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేరెంట్స్, నిర్వాహకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ విషయాన్ని పాలకుర్తి పాపయ్య తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 29 ,(చట్టం బ్యూరో) :** కొత్తపల్లి మండలం లోని ఎలగందుల గ్రామం లో ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను గ్రామ సర్పంచ్ నిమ్మల అంజయ్య పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుండ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు అరెస్ట్

**కొత్తకోట 29 మే 2026 ( చట్టం న్యూస్) :** పాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గురువారం రోజున డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయుచుండగా పెద్దమందడి మండలానికి చెందిన పిడుగు రాముడు పిడుగు ఆంజనేయులు ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి బైక్ పై వెళుచుండగా బైక్ ఆపి బ్రేకింగ్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా వీరికి పరిమితికి మించి అధిక మొత్తంలో మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో ఎస్సై శివానంద గౌడ్ కేసు నమోదు చేసి కోర్టు లోహాజరపరిచారు. ఆత్మకూర్ మెజిస్ట్రేట్ మహమ్మద్ ముక్తియర్ నేరం రుజువు కావడంతో ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అనంతరం ఇద్దరినీ పోలీసుల రిమాండ్ కు తరలించారు..

## ఇంటర్మీడియట్ అకాడమీలపై చర్యలు తీసుకోవాలి

ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /మే 29,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ జిల్లాలో ఇష్టారాజ్యంగా ఇంటర్మీడియట్ అకాడమీలను నెలకొల్పుతూ విద్యార్థుల జీవితాలతో కళాశాలల యాజమాన్యాలు చెలగాట మాడుతున్నాయని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అకాడమీలపై చర్యలు తీసుకోవాలని ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాల అకాడమీలను రద్దు చేయాలని దీని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రత్యక్ష దాడులు కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ రాకేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొలెరోను ఢీ కొట్టిన లారీ: ముగ్గురు మృతి!

**వనపర్తి 29 మే 2026 ( చట్టం న్యూస్) :** కొత్తకోట మండల పరిధిలోని ముమ్మళ్లపల్లి శివారులో కొత్తిమీర లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ బ్లాస్ట్ కావడంతో రోడ్డు పక్కకి ఆపి టైర్ మార్క్ మార్చుకుని చుండగా కర్నూల్ నుండి హైదరాబాద్ వెళ్తున్న తమిళనాడు లారీ వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే బొలెరో వాహనం నుచ్చు నుచ్చు అయింది మృతులు ఎం రాజశేఖర్ వయస్సు 30 కే జగదీష్ వయస్సు 25 ఎం శివాజీ మృతి చెందారు. కొత్తకోట ఎస్సై ఎం శివానంద గౌడ్ ఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమల ప్లైవుడ్, గ్లాస్ మర్చంట్,హార్డ్ వేర్ ప్రారంభం.

**ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డాక్టర్ అల్లం రమ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు.**



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ అమీనపురం గ్రామానికి చెందిన యం.శ్రీనివాస్ జ్యోతిరావు పూలే సెంటర్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న తిరుమల ప్లైవుడ్, గ్లాస్ మర్చంట్,హార్డ్ వేర్ శుక్రవారం ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్,కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు.ఈ కార్యక్రమంలో వల్లందస్ రవి, బానోత్ బాధ్య,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కళ్ళెం శ్రీనివాస్ రెడ్డి,సత్యనారాయణ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా గౌరీశంకర్...

**నియామక పత్రం అందజేసిన అధ్యక్షులు లక్ష్మి నారాయణ.**



**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు,మే 29 (చట్టం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణానికి చెందిన ప్రొద్దుటూరి గౌరీ శంకర్ ను రాష్ట్ర అధ్యక్షులు, అమరవాది లక్ష్మీనారాయణ, హైదరాబాద్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేసినారు. అమరవాది లక్ష్మీనారాయణ కు చేదోడు వాదోడుగా అతను చేసే కార్యక్రమాలలో ముందుండి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుని ఆర్యవైశ్య సంఘంలో వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందుండి పాల్గొనే వ్యక్తి ప్రొద్దుటూరి గౌరీ శంకర్... గౌరీ శంకర్ గతంలో ,ఈసారి మొత్తంగా రెండుసార్లు నియామక పత్రం అందుకోవడం ఆర్యవైశ్య ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందించుటలో ముందుండే గౌరీ శంకర్ ఎన్నో ఉన్నత శిఖరాలకు అందుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్య సోదరులు ఆశిస్తున్నారు.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### సాహితీసభల సందోహం



అనేక సాహితీ సమావేశాలకు ...
అభిమానిగా హాజరయ్యా ---
అక్షరాల ఆహ్లాదాలను ఆస్వాదించా,
కవుల కంఠాల్లోని కమ్మని కవిత్వాన్ని క్రోలుకున్నా॥

బహు సాహితీ సమావేశాల్లో ...
కవిగా పాల్గొన్నా ---
పదాలకు పరిమళాలు అద్దా,
భావాలకు భాష్యమై హృదయాలను హత్తుకున్నా॥

చాలా సాహితీ సమావేశాలకు ...
సంధానకర్తగా సమన్వయపరచా ---
మనసులను మల్లెల దండలా కూర్చా,
మాటలను మమతల మకరందాలుగా మేళవించా॥

పలు సాహితీ సమావేశాల్లో...
అతిథిగా వేదికలపై ఆసీనుడనయ్యా ---
సభాస్థలాన్ని సాహితీ మందిరంగా తీర్చిదిద్దా,
సాహిత్య సుగంధాలను సభలో వెదజల్లా॥

పెక్కు సాహితీ సమావేశాలను...
కార్యకర్తగా ఏర్పాట్లు చేశా ---
శాలువాలు మరియు మెమెంటోలు చేకూర్చా,
సాహితీ సేవకు సమయాన్నే సమర్పించా॥


స్వయంగా సాహితీ సమావేశాలను ...
నిర్వాహకుడిగా జరిపించా ---
సభలను సాఫల్యపథంలో నడిపించా,
కవుల కీర్తిని కలకాలం నిలిపించా॥

ఎన్నో సాహితీ సమావేశాలకు ...
సాహితీ పోషకుడిగా సాయం అందించా ---
అక్షరాలకు అండగా నిలిచా,
అభ్యుదయ భావాలకు ఆశ్రయమై నిలిచా॥

సాహితీ సమావేశాల సమీక్షలను ...
ప్రచారకుడిగా పత్రికలకు పంపా ---
కవిత్వ కాంతులను ప్రపంచానికందించా,
తెలుగు తల్లి తేజాన్ని దిక్కులన్నిటా చాటించా॥

వివిధ సాహితీ సమావేశాలకు ...
విభిన్న రూపాల్లో పాటుపడ్డా ---
అక్షరయజ్ఞంలో అహర్నిశలు శ్రమించా,
తెలుగు సాహిత్యతోటలో పరిమళపుష్పాలను పూయించా॥

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.



## చట్టం సాహితీ లోకం
95814 19999

### కవిగా



పదాలు పెంచి,
పాదాలేంచి,
గాడతలు పెంచి,
వచనాలు కుర్చీ,
అలంకారాలు తుంచి,
కరములు చాచి,
రచనలు చేసి,
పుస్తకాలు రాసి,
"నేనెటో వెళ్లిపోయానని"
బాధనొంది
కృంగిపోయాను!
కానీ,
"కవిగా "మీలో"
బ్రతికున్నానని"
నాకిప్పుడే
అర్థమైంది,
నా జన్మ
ధన్యమైంది,
మీ అందరికీ
నా
వందనములు,
జైహింద్,

డాక్టర్, కందుల సుధాకర్
తెలంగాణ కేసరి,
సోషల్ రిఫార్మర్,
సేవ రత్న, స్వర్ణ నంది
అవార్డు గ్రహీత,
మానవుల విలువల
సందేశకుడు,
ఖమ్మం జిల్లా,
9390708322.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### జీవితం- సుఖదుఃఖ సంగమం




గడుపుతున్న జీవితంలో
ఎన్నో వడుదుడుకులు
సాఫీగా సాగుతుంటే
కలుగును సంతోషం!

గడియగడియకు గండం
క్షణక్షణ అవరోధమయం
ఆచితూచి అడుగు వేస్తే
అందును సుఖమయం!

బాధ్యతలు బరువులు
బతుకుముంగిట షరతులు
అదిగమించి పయనిస్తే
తొలగును కమ్ముకున్నతెరలు!

ఉన్నోడికి అన్నీ బాధలే
అల్పుడికి అన్నీ వ్యధలే
కాలంచూపే వింతమార్గం
చూసినడిస్తే అదోసోపానం!

కర్మ సిద్ధాంతానికి
అందరం భాద్యులం
మెలకువతో నడుచుకుంటే
జీవితమెంతో సంతోషం!

డా.ప్రసాదు యంవివి(సాదు)
కల్లూరు, ఖమ్మం జిల్లా

----------

## చట్టం సాహితీ లోకం
95814 19999

### వేదమాత గాయత్రి విజ్ఞాన ప్రతీక



వేదమాత గాయత్రీదేవి దివ్యావతరణ
ప్రధానంగా దివ్యజ్ఞానావిర్భావపు స్మరణ

మహామాత మహిమాన్విత మంత్రరూపము
మహాజ్ఞాన స్వరూపిణీ మహా మహద్దైవము
మహాదివ్య చైతన్యం పూతవేదవిజ్ఞానము
మహామార్గదర్శిని ఆధ్యాత్మిక వికాసనము

భగవంతుడువిధాత మహాక్రతువు చేయగా
యాగారంభానికింక సావిత్రిదేవి చేరదు
యాగమెట్లు పూర్తియౌను దైవశక్తి లేకుండా
సాగె దివ్యకాంతులీను స్వరూపము గాయత్రి

ఆధ్యాత్మిక శక్తికి గాయత్రియే ప్రతీక
స్వాధ్యాయపుభావన విశ్వచేతనా స్పందన
మా ధ్యానతపోశక్తి మౌనికోటి అనుభవించె
శ్రేయార్థము గ్రహించె అందించెనవని కౌశికుడు

పంచభూతములు మాతాముఖాలని గ్రహించు
పంచకోశముల ప్రతీక మార్గదర్శకత్వమురా
ఎంచ పదిభుజాలు దైవికశక్తులను నించు
అంచయాన మసత్యసత్యాల వివేకం జూపు

భౌతిక వాంఛలకుకాదు పారమార్థిక ప్రార్థన
మతిచైతన్యం జాగృతి ప్రకాశింప జేయును

జ్యోతికి నడ్పించును మతి నజ్ఞానాంధ్యమూడ్చి
మితమయోమయం నుండి చైతన్యం జూపును


తల్లి పిల్లలను దయతో పోషించీ నడిపినట్లు
కల్లమానవాళి మేల్కొల్పు తృజ్ఞానాశను
ఎల్లరు బత్తినిజపించ ఉల్లము పరిశుద్ధమౌను
చల్లని యాలోచనలు ఏకాగ్రత చైతన్యము

జ్ఞానోదయ జాగృతికి జన్మోత్సవ మీయమ్మ
జ్ఞానదీప ప్రదీపనతో ఆధ్యాత్మికప్రయాణము
జ్ఞాని హృదయాలయాల శాశ్వత చైతన్యజ్యోతి
జ్ఞానాధ్యాత్మిక సత్యజ్యోతి మనలనడిపించును

రచన::శంకర్ జీ డబ్బీకార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

## చట్టం సాహితీ లోకం
95814 19999

### సంస్కారసింధువు




జయజయ ధ్వనుల జ్యోతిర్మయుడై జనహృదయాల్లో చిరంజీవిగా వెలిగిన మహానట మహామహుడు శ్రీ నందమూరి తారక రామారావు.

ధర్మధ్వజమై ధీరత్వదీపమై దివ్యనటనా వైభవంతో తెలుగు తల్లికి తేజోకిరీటం కట్టిన మహోన్నత మహర్షి.

పౌరాణిక పాత్రల పవిత్ర పరిమళమై పరమాత్మ తత్వాలను ప్రజల హృదయాల్లో ప్రతిష్ఠించిన పరమ పూజ్యుడు.

కృష్ణకిరీటపు కాంతులు విరాజిల్లే కళారాజసంతో గీతామృత గంభీరతను గృహాగృహాన ప్రసరింపజేసిన మహానట శిఖామణి.

రామరాజ్యపు రమ్యస్ఫూర్తితో ప్రజాసేవా పథంలో పరితపించి పేదల కన్నీటి చరిత్రను పాలవెల్లిగా మార్చిన పరమదయామూర్తి.

నటనా నవరసాల నందనవనమై నవతెలుగు వైభవాన్ని నవరత్నాల వెలుగులా ప్రపంచానికి పరిచయం చేసిన నటసార్వభౌముడు.

అన్నదాన ఆనంద అమృతవర్షమై ఆకలితో అలమటించిన అభాగ్య హృదయాలకు ఆత్మీయ ఆదరణగా నిలిచిన ఆపద్బాంధవుడు.

నిష్కల్మష నిస్వార్థ నిత్యసేవామూర్తిగా నిరుపేదల నిలువుటద్దమై నిత్యం ప్రజల శ్రేయస్సుకోసమే శ్వాసించిన నాయక శిరోమణి.

తెలుగు జాతి తలపాగా తేజోవైభవమై తెలుగు ఆత్మగౌరవాన్ని త్రివిక్రమ కాంతులతో తిరుగులేని శిఖరాలకు చేర్చిన మహోన్నతుడు.

మానవసేవే మాధవసేవ అనే మహాసత్యాన్ని మనస్సాక్షిగా మలచి మట్టిలో మాణిక్యాలైన ప్రజల హృదయాలను గెలుచుకున్న మహనీయుడు.

సత్యసంకల్ప సౌజన్యస్వరూపుడై సమానత్వ సందేశాలను సమాజపు సరిహద్దులన్నిటికీ సుగంధాలై చిమ్మిన సంస్కారసింధువు.

కళాకాంతుల కల్పవృక్షమై కళాకారుల కష్టాలను కన్నీటి తుడుపుగా మార్చి కళామాతకు కంచుకోటగా నిలిచిన కళాభరణుడు.

పేదప్రజల ప్రాణప్రియుడై పరిపాలనా పటిమతో ప్రజాహితం పరమపదమని ప్రతిజ్ఞ చేసిన ప్రజానాయక ప్రవర్తకుడు.

రాజనీతి రమణీయ రత్నాకరుడై రాష్ట్రసేవా రథసారథిగా రేయింబవళ్లు ప్రజాకల్పనలకై పరితపించిన ప్రజాప్రియుడు.

వేదవాక్యాల వెలుగుల వీణగా విలువల భారతాన్ని విశ్వవేదికపై విరాజిల్లించిన విశ్వమానవ వాగ్గేయరూపుడు.

సినిమా సీమల సింహస్వప్నమై సజీవ దేవతా రూపాలతో సంస్కృతీ సంపదలను సంరక్షించిన సాహిత్యసౌధ శిల్పి.

భక్తిరసాల భవ్యాభరణమై భారతీయ ఆధ్యాత్మికతను భావితరాల బాటల్లో భాస్వర కిరణాలుగా నింపిన భవ్యచైతన్యుడు.

కష్టజీవుల కన్నీటి కడలిలో కరుణామృత కలశమై కలకాలం కాపాడిన కరుణాకర చక్రవర్తి.

ప్రజాహృదయ ప్రజ్వలన ప్రభంజనమై ప్రాణాలకన్నా ప్రజల గౌరవానికే ప్రాధాన్యం ఇచ్చిన పరమోన్నత పురుషుడు.

తెలుగు నేల తేజోనిధిగా త్యాగతపస్సుతో తల్లితెలుగుకు తలమానికంగా నిలిచిన తారకరామ తేజస్వి.

ఆదర్శాల ఆకాశ అర్చనగా ఆత్మగౌరవ ఉద్యమానికి అమరజ్యోతిగా అవతరించిన ఆంధ్రాభిమాన ఆరాధ్యదైవం.

నటనలో నిగూఢనైపుణ్యమై నాయకత్వంలో నిత్యనూతన నవరత్నమై నిండైన జీవన సందేశంగా నిలిచిన నవయుగనేత.

దైవభక్తి ధర్మభావ దీప్తులతో దానగుణ దివ్యచరిత్రగా దశదిశలా దివ్యకీర్తిని విరజిమ్మిన దయాసాగరుడు.

అభిమానుల ఆత్మీయ ఆశ్రయమై ఆంధ్రవాణి ఆరాధనగా అజరామర చరిత్రలో అక్షరదీప్తిగా నిలిచిన అమరనటుడు.

జయజయ గానాల జ్ఞాపకజ్యోతిగా జగత్తు ఉన్నంతవరకు జనహృదయాల్లో చిరస్థాయిగా వెలిగే తెలుగు తేజోమూర్తి శ్రీ నందమూరి తారక రామారావు గారికి శతకోటి వందనాలు.

రచన బిటవరం శ్రీమన్నారాయణ ఎలుకూర్తి హవేలీ వరంగల్.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### మీరు కన్నబిడ్డలా..? కాలసర్పాలా..?

కన్న బిడ్డలే
మెడకు ఉరితాళ్లైతే..?
కన్న బిడ్డలే
కాటేసే కాలసర్పాలైతే..?

కన్న కొడుకులే
కడుపులో కత్తులైతే...
కన్న కూతుళ్లే
కంటిలో కారమైతే...

తల్లిదండ్రుల గుండెల్లో
తీవ్ర తుఫాన్ల తాండవమే...

పాలిచ్చి పెంచిన ప్రాణదీపాలనే
పగబట్టి పాములై కాటేస్తారా..?

ప్రేమను పంచిన వారిపైనే
పిడుగులై విరుచుకు పడతారా..?

నీడ నిచ్చిన వృక్షాలనే
నిర్దాక్షిణ్యంగా నరికేస్తారా..?

కారు చీకటిలో చేయిపట్టి
వెన్నెల వెలుగు దారులు
చూపిన కన్న వారిపైకే
కాలిచెప్పులు విసురుతారా..?

అమ్మ ఒడిలో ఒరిగిన వారు...
అమృతం త్రాగి పెరిగిన వారు...
ఆ ఒడినే అగ్నిగుండంగా మారుస్తారా..?

నిన్న నాన్న చెమట చుక్కలు
మీ భవిష్యత్తుకై జలపాతాలైతే...
వారి వృద్ధాప్యం నేడు మీకు భారమా ..?

బైబిల్ బోధిస్తుంది ---
"తల్లిదండ్రులను పూజించమని"...
వేదం వేడుకుంటుంది ---
"మాతృదేవో భవా...ని"...
ఖురాన్ హెచ్చరిస్తుంది ---
"వారి మనసు నొప్పించవద్దనిబి...
అన్ని మతాల మూలమంతా
అదే మానవతా మంత్రం కాదా..?

వృద్ధుల కాళ్ళు వణుకే వేళ
వారికి వాకిళ్లు మూసేస్తారా..?
విధివ్రాత తిరగబడితే...రేపు
మీరు విధి వాకిట నిలబడరా..?

తల్లిని తిట్టిన నాలుక
తరతరాలకు తుప్పుపట్టదా..?
తండ్రిని కొట్టిన బయటకు
నెట్టిన బిడ్డల బంగారు
భవిష్యత్తు భస్మమైపోదా.?

పుట్టించిన వారిని
పాత తరమని పక్కన పెట్టి...
అనాథాశ్రమ ద్వారాల వద్ద
అవమానాల బురద చల్లే...
ఓ బిడ్డలారా మీ మానవత్వమెక్కడ..?

ఓ మర్రిచెట్టును మింగే మిడతలారా..?
కన్నవారిని కాపాడలేని మీరు
కోట్ల ఆస్తి కూడబెట్టి లాభమేమి..?
కన్న తల్లి కన్నీటి శాపం తగిలితే
పాలరాతి తాజ్‌మహల్‌లోనూ
ప్రశాంతత దొరకునా మిత్రులారా..?

తల్లిదండ్రుల పాదాలే
పరలోకపు పుష్పపథాలు...
వారి ఆశీస్సులే దీవెనలే...
విజయాల అమృత వర్షాలు...
వారి బోసి నవ్వులే...
ఇంట్లో దీపావళి సంబరాలు...!


అందుకే ఓ బిడ్డలారా...!
మీ కన్నవారిని ఏ కడుపు కోతకో ఏ
మాసిన క్షభకో గురిచేసి చితికి చేర్చకండి..
వారి గుండెల్లో గాయాలను చెక్కకండి...

వారి వృద్ధాప్యాన్ని
వెలుగుల వసంతంగా మార్చండి...
మీ కన్న తల్లితండ్రులను
నిత్యం గుండె గర్భగుడిలో నిలబెట్టండి..

వారి సేవలోనే ఉంది నిజమైన శివత్వం...
వారి ఆశీస్సుల్లోనే ఉంది నిజమైన స్వర్గం..

కన్నవారంటే కాసింతైనా కరుణ దయ
జాలి ప్రేమ కృతజ్ఞతలేని కన్న బిడ్డలు
కూడుతిని కుండను పగులగొట్టే కుక్కలు.

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
గోవా కడలి కవి రత్న
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



## చట్టం సాహితీ లోకం
95814 19999

### ప్రజాస్వామ్యంలో రాజతంత్రం



"ఏదో మంచి చేస్తారని గుడ్డి నమ్మకమే విశ్వాసం"
సాధ్యం కానిది సాధిస్తామన్న భ్రమే విశ్వాసమా?
కాదు. నిరీక్షించేవారి నిజస్వరూపం విశ్వాసం.
ఔదార్యం ఎక్కడ వెల్లివిరుస్తుందో,
ఆ సమాజమే అభివృద్ధి రథానికి సారథి అవుతుంది.
హక్కుల పోరాటాల నెత్తుటి తడి,
రేపటి తరాల మనుగడకు వేసిన పునాది.

ఉచితం, సంక్షేమం ముసుగులో నిజమైన అభివృద్ధికి అవరోధాలు.
తరాలు మారినా తలరాతలు మారలేదు.
ఎవరిని నమ్మి పట్టం కట్టారో,
వారి చేతిలోనే ప్రతిసారీ మోసపోతున్నారు.
ఎవరి ఉన్నతి కోసం చెమటోడ్చారో, వారే పురోగమించారు.
పురోగమనానికి నిచ్చెనలై నిలిచిన వారి బతుకులు తిరోగమనం!
చేడు చేసిన వారినే గద్దెనెక్కిస్తున్నాం!

పాలక పాశవిక క్రీడలు పాసివికం!
"బ్రహ్మను తిమ్మను, తిమ్మను బ్రహ్మను" చేయడం
రాజకీయ జీవనశైలిలో షరా మామూలే.
"దీర్ఘకాల అపరిష్కృత" సజీవ సమస్యలుగా నిత్యం కొనసాగించడమే వారి చాణిక్య నీతి!

సనాతన ధర్మం జెండా పట్టిన చేతులే,
సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛలకు ఉక్కు పాతర వేస్తున్నారు!
మతం మత్తు, కులం కుంపటి.
రెండింటినీ రాజేసి చలి కాచుకుంటోంది నేటి రాజకీయం.

ఉచిత విద్య కార్పొరేట్ గుప్పెట్లో బందీ అయింది.
ఉచిత వైద్యం పంచతార ఆసుపత్రులకు తాకట్టు పడింది.
ఉద్యోగం, ఉపాధి అంటే ప్రైవేటీకరణ పేరుతో వేలం.
ప్రజా భవిష్యత్ అంధకారం,

రచన: అనగల్లు మునిరత్నం
పూతలపట్టు, చిత్తూరు జిల్లా
9963288544

# చట్టం సాహితీ లోకం

95814 19999

## పేదవాడి బతుకు చిత్రం



రెక్కాడితే గాని డొక్కాడదని తెలుసు,
అందుకే సూర్యుడికంటే ముందే మేల్కొంటాడు.

చెమట చుక్కలను పెట్టుబడిగా పెట్టి,
శ్రమనే నమ్ముకుని జీవిస్తాడు పేదవాడు.?

చిరిగిన చొక్కా వేసుకున్నా,
గుండెల్లో అమాయకత్వం దాచుకుంటాడు.

అద్దె కొంపలో దీపమై వెలుగుతూ,
ఆకలి బాధలను దిగమింగుకుంటాడు.

పెద్దల మేడల నీడన బతుకుతూ,
చిన్న ఆశల తోటను పెంచుకుంటాడు.

వానొస్తే కారే ఆ పూరి గుడిసెలోనే,
కోటి కలల సామ్రాజ్యాన్ని కంటాడు.

పండుగ వస్తే పస్తులున్నా సరే,
ఎదుటివారి ముఖంలో నవ్వును కోరతాడు.

ధనవంతుల విలాసాల నడుమ,
పైసా కోసం ప్రాణాలు అర్పిస్తాడు.

కండల బలమే వాడికున్న ఆస్తి,
కష్టపడే తత్వమే వాడి అసలు వ్యక్తిత్వం.

సమసమాజం కోసం కలలు కంటూ,
సహనంతో కాలం వెళ్లదీస్తాడు.?

యాచించడం వాడికి చేతకాదు,
కష్టార్జితం తోనే బతకాలని చూస్తాడు.

ఈ సృష్టిని నడిపించే శ్రామికుడు వాడే,
సమాజానికి వెన్నెముక ఆ పేదవాడే!

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా



# చట్టం చిత్రం


## క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక




సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷–లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.

--------------

## దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?




టాలీవుడ్ దర్శకుడు సుకుమార్– సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప–2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి

భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో సంగీతం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర సంగీత దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ – సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం. కథ పూర్తిగా సిద్ధం కాకముందే సంగీత దర్శకుడిని ఫైనల్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది.

## పెద్దిపై అసత్య ప్రచారం

### ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు




'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలు చేపట్టినట్లు అయింది. ఇప్పుడు ఇలా సోషల్ మీడియాలోనూ చిత్రబృందం యాక్టివ్‌గా ఉంటూ నిశితంగా పరిశీలించి నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది


## జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా




తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై–ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో

వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్–ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు




అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

# చట్టం స్పోర్ట్స్

## క్వాలిఫైయర్ 2లో ఆరెంజ్ క్యాప్ కోసం పోటీ

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంది. కేవలం రెండు మ్యాచ్‌ల ఫలితాలతో ఈ 19వ ఐపీఎల్ సీజన్ విజేత ఎవరో తేలిపోనుంది. ఒకవైపు డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి కప్పు కొట్టాలని చూస్తుంటే.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు ఫైనల్ చేరడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. టీమ్స్ మధ్య టైటిల్ ఫైట్ ఎలా ఉన్నా.. వ్యక్తిగతంగా ఆటగాళ్ల మధ్య అత్యధిక పరుగులు చేసిన వారికి ఇచ్చే ఆరెంజ్ క్యాప్ కోసం మాత్రం ఊహించని రేంజ్‌లో రసవత్తర పోరు సాగుతోంది. తాజా గణాంకాల ప్రకారం.. ఐపీఎల్ 2026 లో అత్యధిక పరుగుల వేటలో రాజస్థాన్ రాయల్స్ )కు చెందిన 15 ఏళ్ల సంచలన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అందరినీ వెనక్కి నెట్టి మొదటి స్థానానికి దూసుకెళ్లాడు. గుజరాత్ టైటాన్స్ రన్ మెషిన్ సాయి సుదర్శన్‌ను వెనక్కి నెట్టి మరీ ఈ చిన్నోడు నెంబర్ వన్ సింహాసనాన్ని కైవసం చేసుకున్నాడు. మే 27న సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ రేస్‌లో ఐదో స్థానంలో ఉన్నాడు. కానీ ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లను ఉతికి ఆరబెడుతూ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగుల రికార్డు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్ రేస్‌లో ఏకంగా ఒకేసారి పెద్ద జంప్ చేసి మొదటి స్థానాన్ని చేరుకున్నాడు. ఈ మ్యాచ్ కంటే ముందు అతని ఖాతాలో 583 పరుగులు ఉండగా.. ప్రస్తుతం 15 ఇన్నింగ్స్‌ల తర్వాత వైభవ్ సూర్యవంశీ మొత్తం 680 పరుగులతో టాప్‌లో నిలిచాడు. దీనితో ప్రస్తుతానికి ఆరెంజ్ క్యాప్‌ను తన తలపైనే ఉంచుకుని కింగ్‌లా నిలబడ్డాడు. వైభవ్ సూర్యవంశీ మొదటి స్థానంలో ఉన్నప్పటికీ ఆరెంజ్ క్యాప్ పోరు ఇంకా ముగిసిపోలేదు. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ 652 పరుగులతో వైభవ్‌కు అత్యంత సమీపంలో రెండో స్థానంలో ఉన్నాడు. కేవలం 28 పరుగుల తేడాతో వైభవ్ వెనుక ఉన్నాడు. హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లకు పెద్ద ఇన్నింగ్స్ ఆడి ఈ రేసులో నిలిచే అవకాశం ఉన్నప్పటికీ వారు ఫ్లాప్ అయ్యారు. దాంతో హైదరాబాద్ టోర్నీ నుండి నిష్క్రమించగా.. సాయి సుదర్శన్‌కు మాత్రం క్వాలిఫైయర్ 2 లో వైభవ్‌ను దాటేసే సువర్ణావకాశం లభించింది. సాయి సుదర్శన్ గత ఐపీఎల్ 2025 సీజన్లో కూడా ఆరెంజ్ క్యాప్ విన్నర్‌గా నిలిచాడనే విషయం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 2025 లో అతను 15 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 759 పరుగులు చేసి టోర్నమెంట్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఐపీఎల్ 2026 లోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తూ వరుసగా రెండోసారి ఆరెంజ్ క్యాప్ అందుకోవాలని సాయి సుదర్శన్ కసిగా ఉన్నాడు. మే 29న జరగబోయే క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌లో రాజస్థాన్, గుజరాత్ జట్లు తలపడనున్న నేపథ్యంలో.. ఈ మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ వర్సెస్ వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ క్లాష్ లైవ్‌గా చూడబోతున్నాం. రాజస్థాన్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్ కేవలం ఫైనల్ బెర్త్ కోసమే కాదు.. ఆరెంజ్ క్యాప్ విన్నర్ ఎవరో డిసైడ్ చేయడానికి కూడా అత్యంత కీలకంగా మారింది. ఒకవేళ సాయి సుదర్శన్ ఈ మ్యాచ్‌లో 28 కంటే ఎక్కువ పరుగులు చేస్తే వైభవ్‌ను దాటేస్తాడు. అయితే రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ కూడా అదే మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడితే సాయి సుదర్శన్‌కు అందనంత ఎత్తులో నిలుస్తాడు. 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ గెలిచి చరిత్ర సృష్టిస్తాడా, లేక సీనియర్ ప్లేయర్ సాయి సుదర్శన్ తన అనుభవంతో వరుసగా రెండోసారి క్యాప్ కొడతాడా అనేది ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.



## గుజరాత్ బౌలర్లకు ప్యాట్ కమిన్స్ విలువైన సలహా



అందరి కళ్ళు రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పైనే ఉన్నాయి. అతని విధ్వంసకర బ్యాటింగ్‌ను అడ్డుకోవడానికి గుజరాత్ బౌలర్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఒక విలువైన సలహాను అందించాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే ఏ బౌలర్‌కైనా చెమటలు పట్టడం ఖాయం. బౌలర్ల నామరూపాలు లేకుండా చేస్తూ మైదానంలో అతను సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసిన వైభవ్, ఇప్పుడు అదే ముల్లాన్‌పూర్ పిచ్‌పై గుజరాత్‌తో తలపడనున్నాడు. దీంతో గుజరాత్ బౌలింగ్ విభాగం అతడిని ఎలా అవుట్ చేయాలనే దానిపై తీవ్రంగా బుర్ర బద్దలు కొట్టుకుంటోంది. ఏ చిన్న తప్పు చేసినా మ్యాచ్ చేజారిపోతుందనే భయం గుజరాత్ క్యాంప్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.ప్రపంచ స్థాయి బౌలర్, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం వైభవ్ సూర్యవంశీ దెబ్బకు తల్లడిల్లిపోయాడు.

ఎలిమినేటర్ పోరులో బంతిని ఎక్కడ వేసినా సరే, వైభవ్ దాన్ని స్టాండ్స్‌లోకి పంపించడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే సీనియర్ బౌలర్ అయిన కమిన్స్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 64 పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. వైభవ్ బ్యాటింగ్ ధాటికి కమిన్స్ ఎంతగా అల్లాడిపోయాడో ఈ గణాంకాలే చెబుతున్నాయి. "వైభవ్ సూర్యవంశీకి వేరే ఎక్కడ బంతి వేసినా వృథానే. అతడిని కట్టడి చేయాలంటే యార్కర్లు, స్లో బంతులు మాత్రమే ఏకైక మార్గం." అని ఎలిమినేటర్ ఓటమి అనంతరం ప్యాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. తాను అనుభవించిన పరాభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈరోజు జరగబోయే క్వాలిఫయర్ 2 మ్యాచ్ కోసం గుజరాత్ బౌలర్లకు కమిన్స్ ఒక కీలకమైన రహస్యాన్ని చెప్పాడు. ముల్లాన్‌పూర్ పిచ్‌పై వైభవ్‌ను ఎదుర్కోవాలంటే కేవలం ఖచ్చితమైన యార్కర్లు, చాకచక్యమైన స్లోయర్ బంతులు మాత్రమే ఉపయోగపడతాయని తెలిపాడు. లైన్ అండ్ లెంగ్త్ కొద్దిగా తప్పినా అతను ఉపేక్షించడని హెచ్చరించాడు. మరి ఈరోజు మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు కమిన్స్ ఇచ్చిన ఈ సలహాను పాటిస్తారా? లేక వైభవ్ విధ్వంసానికి బలవుతారా? అనేది చూడాలి.క్వాలిఫయర్ 2 పోరులో గెలిచిన జట్టు మే 31న జరిగే గ్రాండ్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడనుంది. టైటిల్ పోరుకు అర్హత సాధించాలంటే గుజరాత్ జట్టు ముందుగా వైభవ్ సూర్యవంశీ అనే అతిపెద్ద అడ్డంకిని దాటాల్సి ఉంటుంది. ఈ రసవత్తర పోరులో విజయం ఎవరిని వరిస్తుందో కొన్ని గంటల్లో తేలిపోనుంది.

## సత్తా చాటిన భారత అథ్లెట్లు!

రత మహిళా షూటర్ ఈషా సింగ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. జర్మనీ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) వరల్డ్?కప్? మ్యూనిచ్?లో ఈషా కొత్త బెంచ్? మార్క్ క్రియేట్ చేసింది. 25 మీటర్ల మహిళల పిస్టల్ ?ఈవెంట్?లో ఈషా 50కిగానూ 43 స్కోర్ చేసింది. ఈ ఈవెంట్?లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. దీంతో సరికొత్త రికార్డుతోపాటు ఈషా స్వర్ణ పతకం గెలుచుకుంది. రెండో రోజు జరిగిన పోటీలో 21ఏళ్ల ఈషా, జర్మనీకి చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ డోరీన్ వానెకాంప్‌తో పోటీ పడింది. 5 పాయింట్ల తేడాతో ప్రత్యర్థిని ఓడించిన ఈషా గోల్డ్ పట్టేసింది. ఒలింపిక్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈషా ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. తొలి మూడు సిరీస్‌లలోనూ పర్ఫెక్ట్ స్కోర్లు సాధించి, ప్రత్యర్థులపై భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ క్రమంలోనే కిమ్ యే-జి (కొరియా) నెలకొల్పిన 42 పాయింట్ల ప్రపంచ రికార్డును ఈషా బద్దలు కొట్టింది. ఇక ఈ పోటీలో మూడో స్థానంలో నిలిచిన మిరోస్లావా (బల్గేరియా) మిన్‌చెవా కాంస్య పతకాన్ని గెలుచుకుంది. స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఇషా సింగ్ మాట్లాడుతూ, "నాకు మ్యూనిచ్ చాలా ముఖ్యమైనది. ఇక్కడ షూటింగ్ పోటీలలో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. టాప్-8 లోకి రావడం అంత సులభం కాదు. నేను ఇక్కడికి రావడం ఇది మూడోసారి. అందుకే ఈసారి ఎలాగైనా గెలవాలని కోరుకున్నాను" అని తెలిపింది. అలాగే ఫైనల్ మ్యాచ్? సందర్భంగా ఒత్తిడి గురించి మాట్లాడుతూ, "నేను అస్సలు ప్రశాంతంగా లేను. ఒకానొక సమయంలో నా ఎడమ చేయి వణికింది. చాలా భయం వేసింది. కానీ మన క్రీడలో ఆ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనుభవం అంటే అదే" అని ఈషా పేర్కొంది. మరోవైపు భారత పారాఅథ్లెట్ సుమిత్ అంటిల్ కూడా రికార్డు సృష్టించాడు. బెంగళూరు వేదికగా జరిగుతున్న 8వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో, సుమిత్ క్రీడా ప్రపంచాన్ని నివ్వెరపరిచే అద్భుత ఘనతను అందుకున్నాడు. భారత ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తన కెరీర్‌లో ఏడోసారి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి, చరిత్ర పుటల్లో మరో సువర్ణ అధ్యాయాన్ని లిఖించాడు. బుధవారం శ్రీ కంఠీరవ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఖీ64 విభాగం పోటీలో 27ఏళ్ల సుమిత్ 74.82 మీటర్ల భారీ త్రో విసిరి వరల్డ్ రికార్డ్ నెలకొల్పాడు. పారా అథ్లెట్లలో ఇదే లాంగెస్ట్? త్రో. ఇదివరకు కూడా ఈ విభాగంలో అత్యధిక దూరం బల్లెం విసిరిన రికార్డు కూడా సుమిత్?పైనే ఉంది. 2023 ఆసియా పారా గేమ్స్‌లో అతడు 73.29 మీటర్ల దూరం విసిరి అప్పుడు రికార్డు కొట్టాడు. దీన్ని తాజాగా బ్రేక్ చేశాడు. అయితే 2019 నుంచి అతడు ఈ విభాగంలో వరుసగా ప్రపంచ రికార్డులను నెలకొల్పుతూనే ఉన్నాడు. 2019లో ఇటలీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌తో సుమిత్ ప్రస్థానం ప్రారంభమైంది. అక్కడ అతను 61.32 మీటర్ల త్రో తో తొలిసారి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆ తర్వాత 2021లో జరిగిన టోక్యో పారాలింపిక్స్?లో స్వర్ణ పతకాన్ని గెలుచుకునే క్రమంలో మూడుసార్లు ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఆ పోటీలో సుమిత్ వరుసగా 66.95 మీటర్లు, 68.08 మీటర్లు, 68.55 మీటర్ల త్రోలు విసిరి చరిత్ర సృష్టించాడు. అదే సంవత్సరం ఆఖర్లో ఇండియన్ ఓపెన్‌లో 68.62 మీటర్ల త్రో తో మరో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆపై 2023 హాంగ్‌జౌ ఆసియా పారా గేమ్స్‌లో 73.29 మీటర్ల త్రో తో సుమిత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. తాజాగా బెంగళూరులో 74.82 మీటర్ల దూరం విసిరి మళ్లీ తన రికార్డును తానే బద్దలు కొట్టాడు.

........



## సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న పంత్



లక్నో సూపర్ జెయింట్స్ సంచలన ప్రకటన చేసింది. తమ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తికాక ముందే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు పంత్ నాయకత్వంలో ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది.లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తిగా ముగియకముందే.. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఐపీఎల్ 2026లో పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ దారుణ ప్రదర్శన చేసింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు."లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా రిషభ్ పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు" అని లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. వచ్చే సీజన్‌కు ముందు టీమ్‌ను పునర్నిర్మించడంపై తాము ఫోకస్ పెట్టినట్లు వెల్లడించింది.కాగా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కెరీర్ ఆరంభించిన రిషభ్ ఫంత్.. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అనూహ్యంగా ఆ జట్టును వీడాడు. దీంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వచ్చేశాడు. ఇతర జట్లతో పోటీ పడి మరి లక్నో సూపర్ జెయింట్స్.. రికార్డు ధర రూ.27 కోట్లు వెచ్చించి.. పంత్‌ను దక్కించుకుంది. వెంటనే కెప్టెన్‌ను చేసింది. అయితే కెప్టెన్‌గా, ఆటగాడిగా పంత్ పూర్తిగా విఫలమయ్యాడు.లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్ సారథ్యంలో గత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది. ఈ సీజన్‌లో అయితే ఇంకా దారుణ ప్రదర్శన చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. మొత్తంగా పత్ సారథ్యంలో లక్నో.. రెండు సీజన్లలో కలిపి కేవలం 10 మ్యాచ్‌లలో మాత్రమే గెలిచింది. మరోవైపు బ్యాటర్‌గా కూడా పంత్ విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది 312 పరుగులు సాధించాడు. దీంతో విమర్శలపాలయ్యాడు.

## స్మృతి మంధాన గోల్డెన్ డకౌట్



ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత మహిళా జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో స్మృతి ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్ అయింది. ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఇన్నింగ్స్ తొలి బంతికే ఎవ్వరూ డకౌట్ కాలేదు.. ఈ చెత్త రికార్డు అందుకున్న తొలి బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియా రాణించడంతో భారత్ భారీ స్కోర్ చేసి 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది.ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడుతోంది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా చెమ్స్‌ఫోర్డ్‌లో గురవారం తొలి మ్యాచ్ జరగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టెంపరరీ కెప్టెన్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది.టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభించిన స్మృతి మంధాన తొలి బంతికే అవుటయింది. ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ వేసిన బంతిని డిఫెండ్ చేయగా అది చార్లీ డీన్ చేతుల్లోకి వెళ్లింది. దాంతో స్మృతి మంధాన మొదటి బంతికే డకౌట్ అయింది. టీమిండియా ఉమెన్స్ టీ20 చరిత్రలో మొదటి బంతికే డకౌట్ అయిన తొలి బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకుంది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో భారత మహిళల తరఫున అత్యధిక పరుగులు చేసిన స్మృతి మంధానకు ఇది ఆరో డకౌట్. టీమిండియా ఉమెన్స్ జట్టులో టీ20ల్లో అత్యధిక డకౌట్స్ అయిన ప్లేయర్‌గా మాత్రం షెఫాలీ వర్మ ముందు వరుసలో ఉంది. షెఫాలీ వర్మ ఏడు డకౌట్లతో మొదటి స్థానంలో ఉండగా.. టీమిండియా కెప్టెన్ హర్మత్ ప్రీత్ కౌర్ 6, స్మృతి మంధాన 6, జెమీమా రోడ్రిగ్స్ 6, దీప్తి శర్మ ఆరుసార్లు డకౌట్ అయ్యి ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. ఇక తొలి టీ20 మ్యాచ్‌కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దూరమైంది. ఎలాంటి గాయం కానీ, ఫిట్‌నెస్ సమస్య కానీ లేదని.. కేవలం విశ్రాంతి కోసమే ఆమె దూరమైనట్లు టాస్ సమయంలో స్మృతి మంధాన తెలిపింది. మిగతా మ్యాచ్‌లకు హర్మన్ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలి బంతికే వికెట్ కోల్పోయిన టీమిండియా ఈ మ్యాచ్‌లో మంచి స్కోరే నమోదు చేసింది. షెఫాలీ వర్మ కూడా 2 పరుగులకే అవుటవ్వడంతో మొదటి ఓవర్‌లోనే భారత్ ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది. ఆ తర్వాత యస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్ కలిసి టీమిండియా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. భాటియా 54, రోడ్రిగ్స్ 69 పరుగులు చేయగా ఆఖర్లో దీప్తి శర్మ 22 పరుగులు చేయడంతో భారత్ 188/7 పరుగులు చేసింది. భారత్ అందించిన 189 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ వికెట్ కీపర్ ఎమీ జోన్స్ 67 పరుగులతో పోరాడినప్పటికీ 20 ఓవర్లలో 150/8 పరుగులు మాత్రమే చేసింది. దాంతో టీమిండియా 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఆధిపత్యంలో ఉంది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999